# మెఱుపులు : త్రిలోకజ్ఞానాయ నమః

- వేమూరి వేంకటరామనాథం

నేను ప్రతినెల సలిపే సత్యనారాయణవ్రతం సందర్భంలో వింటూ వచ్చిన సహస్రనామాలలో కొన్నిటిమీద ఇంతకు ముందు "తెలుగు జ్యోతి"లో వ్రాశాను. (జితక్రోధాయ నమః -జూలై-ఆగస్టు 2007, జ్ఞాన పంజరాయనమః నవంబరు-డిసెంబరు 2004) అవి నాలో కలిగించిన ప్రత్యేక సారస్యం పురస్కరించుకొని ఆ వ్యాసాలు కూర్చబడినాయి. అదే వరుసలో మఱొక భగవన్నామం గుఱించి యీవ్యాసం వ్రాస్తున్నాను. "త్రికాలజ్ఞానాయ నమః"!

దాని అర్ధం సులభమైనదే. భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్ కాలం - మూడు కాలాల విషయాలు తెలిసిన వాడు భగవంతుడని. ఊరకే "అది జరిగింది" అనియేకాక, దానిని గుఱించిన సంపూర్ణ జ్ఞానం (వెనుకముందులు) వ్యక్తమయినది భగవంతునికే యని దీని భావం. మనకు, మానవులకు, అసలో, లేక సంపూర్ణంగానో, తెలియని వ్యక్తతలో ఏవిషయం మీదనైనా, సంఘటన మీదనైనా భగవంతునికి అవగతమవుతుందని యీ నామస్మరణలో విశదం అవుతుంది.

మన సాధారణ సంభాషణక్రమంలో వింటూ ఉంటాము. "దేనికైనా పూర్వాపరాలు విచారించాలి" అని - అనగా జరిగినదే కాక, "ఇతరము" మీదది కూడ మనసులో ఉంచుకోవాలి అని భావం. వెంటనే రెండు ప్రశ్నలు రేకెత్తుతాయి. "జరిగినది" మనకు తెలిసినదే అనుకుంటున్నది నిజంగా సమగ్రంగా మనకు అవగతమయిందా అన్నదొకటి. ఇది యెలా ఉన్నా, సంబంధితములైన ఇతర విషయాలు మన దృష్టిలో వలసినంత సంపూర్ణంగా, నిర్దుష్టంగా ఉన్నవా అన్నది మఱొక ప్రశ్న. ఈ రెండు ప్రశ్నలు భగవంతుని విషయంలో అనవసరం. ఎందుకంటే ఆయన <u>సర్వజ్ఞుడు</u> గదా! ఈ భావానికి తిరుగు లేదు. "భగవంతుడు" అన్న భావానికి నిర్వచనలో ఇదొక భావం, సమస్తము అవగతమయిన శక్తి అతడు, లేక అది, యని.

మన కనుల ముందు జరిగే సంఘటనలను గూర్చి తప్ప, ఇతరవిషయాలపై, లేక యీ సంఘటనలకు గల సంబంధిత విషయాలపై వలసిన ఎఱుక మనకు - అనగా మానవమాత్రులకు - వలసినంతగా ఉండదని ఎన్నో సంఘటనలు ఋజువు చేస్తాయి. ఇది మన దోషం కాదు, మనకు అందని స్థాయిలో ఈ సంఘటనలు కూర్చబడియుంటాయి - ప్రకృతి వలన. మానవునికి విజ్ఞానం పెరిగిన కొలది వాటి అవగాహన పెరుగుతుంది. కాని ఆ పెరుగుదలకు సంపూర్ణత్వం ఉండక పోవచ్చును. ఉదాహరణకు, మందులకు, వైద్యానికి లొంగుతున్నదనుకొన్న వ్యాధిలో అకస్మాత్తుగా మృత్యువు సంభవించవచ్చును. లేక ఇక లాభం లేదని వైద్యులు కూడ నిరాశ చెందిన వ్యాధిలో అందఱు ఆశ్చర్యం కలిగించే మెఱుగుదల ప్రత్యక్షం కావచ్చును. మహాత్మాగాంధీ చేసిన దీర్ఘ ఉపవాసాలలో వైద్యులకు భీతి కల్గిన క్షణాలలో శ్వాస ఆగిపోకుండా ఆయన తిరిగి సవ్యస్థాయిని అందుకొనగలిగాడు గదా, ఇది చారిత్రక సత్యం; ఇటీవలి దశాబ్దాలలో ఎందఱో గమనించిన ప్రముఖ సత్యం. ఆయనకు ఏ దశ వ్రాసిపెట్టియున్నదో మనకు - మానవులకు, ఆయన చుట్టు ఆత్రుతతో గుమిగూడిన వారికి - తెలియలేదు, అది భగవంతునికే తెలియాలి అని మనం ఊహించాలి. ఈ సందర్భంలో కుతూహలం కొలది శబ్దరత్నాకరం చూశాను. "తెలివి" అంటే ఏమని ఉందో అని. దాని మొదటి అర్ధంగా సూచించబడినది: "దేహాత్మాది భేదజ్ఞానము". ఇది మానవునికి - చాలామంది మానవులకు - అతి - అసంపూర్ణంగా ఉంటుంది. అది సంపూర్ణంగా కలిగినది దేవుడే యని మన భావన. మనకు తెలియని విషయాల సందర్భంలో, ఆపేమని, "అది దేవుడికే తెలియాలి" అని మనం అంటాము గదా. ఆయనకు తెలుసునని మనకెలా నిశ్చయం అంటే, "ఆయనకు కూడ తెలియకపోతే, దానిని తెలిసిన వారు ఇంకెవరుండగలరు" అన్న నిశ్చితభావం మనలో దాగి ఉంది.

ఇక ఈ వ్యాస శీర్షికలోని మూడు కాలాలను గుఱించి సూక్ష్మంగా చర్చించుదాం. భూతకాలంలో జరిగిన విషయాలు సాధారణంగా మనకు తెలుసు, అని అనుకుంటాం. ఇది కొంతవఱకే నిజమన్న సత్యం నిరూపించటానికి ఒక ఉత్తమ ఉదాహరణం తీసుకొందాం. అందఱు తెలిసిన కుంతీ - కర్ణుల కథ. ఈ నాడు మహాభారత కథ ఎన్నో విధాల అవగాహన చేసికొన్న మనకు తెలిసింది కాని, ఆనాడు కర్ణుని మరణం ఆసన్నమయిన సమయం వఱకు అతనికి కూడ తెలియలేదు గదా; అతనిని పెంచిన అతిరథుడు, రాధ, తన తండ్రి, తల్లి కారని కర్ణునికి అనుమానం పీడిస్తూ ఉండినా, తన్ను కన్న తల్లి ఎవరో కృష్ణుడు యుద్ధానికి పూర్వం తనకు తెలిపే వఱకు తెలియదు. కొన్ని భూతకాల పరిస్థితులే విధంగా ప్రధాన పాత్రలకు అగమ్యగోచరంగా ఉండి, వారి జీవన సరణిని ఒక మార్గంలో - సరియైనది కాక పోవచ్చును - నడిపిస్తాయి. కన్నతల్లి కుంతికి, దేవుని అవతారం అయిన కృష్ణునికి మాత్రం నిక్కమైన రహస్యం తెలుసును.

ఈ కథలో మఱొక చిక్కు ప్రశ్న. ఇంత తెలిసి, కర్ణునికి కూడ రహస్యం తెల్పిన కృష్ణుడు ధర్మరాజుకు, వాని తమ్ములకు అది తెల్పలేదు. అది తెలిపియుంటే, ధర్మరాజుయుద్ధం చేసి కర్ణుని అంతానికి కారణభూతుడయ్యేవాడు కాదేమో - వానిని చంపినది తాను కాకపోయినా. ఈ రహస్యం తెలిసికొన్నా కర్ణుడు కౌరవులను విడిచి పాండవుల వైపుకు గంతు వేయడని కృష్ణునికి తెలుసు. తాను చెప్పినట్లూ ఉండాలి - కర్ణునికి ఒక అవకాశం, మార్పుకు - కలిగించినట్లు ఉండాలి; అది కర్ణుడు ఉపయోగించుకొనడని తనకు తెలుసుగదా; కౌరవపాండవుల మధ్య మహాయుద్ధం ఎలాగో జరిగి తీరుతుంది. ఎందఱో దుష్టులు అంతమందుతారు.

ఈ వ్యాసంలోని ప్రధాన సూత్రానికి తిరిగి వద్దాం. పూర్వ ఉదంతాలు మనకు కొంతగా - లేక చాల వఱకు - ఈ పాటికి తెలిసి ఉంటాయని అనుకొందాం. కాని ఆర్యులు మూలం గుఱించి, వారు ఎక్కడనుండి భారతదేశానికి వచ్చినారా అన్న విషయం గుఱించి ఎన్ని భిన్న - ఆలోచనలు - చారిత్రకశాస్త్రజ్ఞుల నుండియే ఉన్నవో మనకు విదితమే గదా - ఎంత కాలంగానో.

వర్తమాన విషయాలను గూర్చి కొంచెం తెలిసికొందాం. వర్తమాన కాలం అనగా ఈ దినమా, క్రిందటి పది రోజులా, లేక ఈ నాటి కాలమా, అన్న ప్రశ్న ఒకటి ఉంది. ఇది తార్కికంగా ప్రముఖమైన ప్రశ్నయే కాని, మన చర్చకు "ఈ రోజులలో" లేక "ఈకాలంలో" అని సమాధానం చెప్పుకుందాం. వర్తమానకాలానికి భూతకాలానికి మన చర్చాదృష్టికి గల ముఖ్య వ్యత్యాసం ఏమంటే, భూతకాలానికి సంబంధించిన అంశాలు చాలవఱకు ఈ పాటికి మనకు అనేక విధాలుగా తెలిసి ఉంటాయి, కాని వర్తమాన సంబంధితమైన సమస్యల పైని ప్రభావాలు ఇంకా సంపూర్ణంగా మనకు వ్యక్తం కాకపోవచ్చును. అన్ని సమస్యల సందర్భంలోను ఈ హెచ్చరిక ముఖ్యం కాదు గాని, ఇదొక గణనీయమైన విశేషమే. దాని ఒక విశిష్ట ఫలితమేమంటే, వర్తమాన విషయాలను పరిగణించటంలో లేక చర్చించటంలో మనకు వలసినంతగా విషయ నిర్దుష్టత ఉండదు. "మొన్ననే" జరిగిన సంఘటన యొక్క సంపూర్ణస్వరూపం, ఫలిత సర్వస్వం మనకింకా నిర్ద్వందంగా వ్యక్తం కాక పోవచ్చును. ఉదాహరణకు, ఇటీవల ఇండియాలో వివిధప్రదేశాలలో జరుగుతున్న అకస్మాత్ - హింసాకాండల సమగ్రహేతువులను గూర్చిన అవగాహన కాలక్రమానగాని మనకు దక్కదు. నేడు మనకు వ్యక్తం కానివెన్నో పరిస్థితులు ఆ సంఘటనలను చుట్టుకొని యుంటాయి. అవన్నీ భగవంతునికే తెలియాలి, ఆయన సర్వజ్ఞుడు కాబట్టి.

ఇక భావి విషయాలకు వద్దాం. ఱేపు జరుగబోయే వెన్నో మనకీనాడు తెలియవు. లాల్ బహాదూర్ శాస్త్రి మృత్యువు వెంట తఱుముకు వస్తున్నదని తెలియక గదా తన ఉద్యోగకలాపంలో రష్యా వెళ్ళాడు! ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రెడ్డి తనకు కొన్ని గంటలలో ప్రచండ ప్రమాదం జరుగనున్నదని తెలియకే గదా ఆ విమానంలో ప్రయాణం చేశాడు! ఏజ్యోతిషం వల్లనైనా తెలుసుకొనియున్నా, అలా జరుగవలెనని వ్రాసియుంటే, ఏవో సంఘటనల మలుపులో ఆ ప్రయాణాలు జరిగేవి, అని మనం ఊహించవచ్చును. తొమ్మిది/పదకొండు నాడు వరల్డు ట్రేడ్ సెంటరుకు యధాప్రకారం ఉదయమే వెళ్ళినవారు ఘోరమైన విమాన ధాటిలో - ఎక్కువసంఖ్యలో - కనులు మూస్తారని కలగన్నారా? పౌరాణిక ఉదాహరణలు తీసికొనవలెనంటే, రావణుడు తాను రామునిచేత చంపబడుతాడని తెలిసియే సీతను అపహరించాడా? ధర్మరాజు శకునితో జూదంలో ఓడిపోతానని తెలిసియే ఆ వేడుకకు దిగాడా?

ఇలాంటి ఉదాహరణ లేమి వ్యక్తం చేస్తాయంటే, ముందు సంభవించబోయే సంఘటనలు స్పష్టంగా మానవునికి వ్యక్తం కావు. కొన్ని సందర్భాలలో ఏదో చూచాయగా అనుమానం వేసినట్లు ఉండవచ్చు, ఉ. యుద్ధంలోకి దిగేవానికి మృత్యుసంభవం వలె, తిరుగులేని వ్యాధిగలవానికి, కొంతగా అది అవగాహన అయినట్లు. కాని దివ్యదృష్టిగల వానికి దప్ప భావికాల సంఘటనలు స్పష్టంగా మనోఫలకంలో గోచరించవు. ఇది పొరపాటు లేని విధంగా కల్గియున్నది భగవంతుడే యని మన విశ్వాసం. ఆయనను సర్వజ్ఞుడని మనం విశ్వసిస్తాముగదా. ఇది కేవలం ఆలోచన లేని ఆచారం కాదు. మానవుడెంత మతిమంతుడైనా కన్గొనలేని విషయాలు - ముఖ్యంగా భావికాలానికి సంబంధించినవి - కొల్లలుగా ఉంటాయి. ఇవి తెలిసినదెవరికి అంటే "భగవంతునికి" అని - ఇక తిరుగులేని - సమాధానం మనకు తట్టుతుంది; అలా మనం అనుకుంటాము.

చివర నొక మాట. ఇలాంటి వెన్నో భావి సంఘటనల గూర్చిన విశేషాలు దేవునికే తెలియాలి అన్న వాక్యం లోని కనీసభావం ఏమంటే అవి మనకు తెలియవు అని. ఎంత చదివినా, ఎంత తెలివి కల్గియున్నా మానవునకు అవగతం కాని విషయాలు, సందర్భాలు కోకొల్లలుగా ఉంటాయి- భూత,వర్తమాన, భవిష్యత్ కాలాలన్నిటికీ చెందినవి. ఇవన్నీ తెలిసిన వాడొక్కడే - పరమాత్మ అని మనం విశ్వసిస్తాము. ఆ మానవేతర ప్రజ్ఞగల నెలవు ఆకారం గల ఒక దివ్యమూర్తియో, లేక నిరాకారమైన ఒక శక్తియో, ఎవరెఱుగుదురు? అది కలదని మాత్రం మానవబాహుళ్యం విశ్వసిస్తుంది.